విద్యుత్ అధికారుల బస్తీబాట



రాయదుర్గం: గోపన్‌పల్లి జర్నలిస్టుకాలనీలో విద్యుత్ అధికారులు బస్తీబాట కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. గచ్చిబౌలి విద్యుత్ డీఈ యాదగిరి, ఏఈ భాస్కర్ ఆధ్వర్యంలో విద్యుత్ సిబ్బంది జర్నలిస్టుకాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులకు అడిగి తెలుసుకున్నారు. పలు చోట్ల విద్యుత్ కేబుల్స్ కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు.

జర్నలిస్టుకాలనీలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

రాయదుర్గం: గోపన్‌పల్లి జర్నలిస్టుకాలనీలో కాలనీ సమన్వయ కమిటీ సభ్యులు శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ అధికారుల ఆదేశంపై సూపర్‌వైజర్ కృష్ణమాదుగుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం కొనసాగింది. కాలనీలోని ఖాళీ స్థలాలు, రోడ్డుపక్కన అక్కడక్కడా చెత్తా కవర్లు, వ్యర్థాలు, ప్లాస్టిక్ కవర్లను తొలగించారు.

అనుమతులు తప్పనిసరి

జిన్నారం(పటాన్‌చెరు): నూతనంగా నిర్మించే ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ తిరుపతి పేర్కొన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తుల కోసం 'బిల్డ్ నౌ' అనే వెబ్‌సైట్ ద్వారా అనుమతులు పొందవచ్చని తెలిపారు. లేదా మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

ఘనంగా దీపావళి పూజలు



మణికొండ: నార్సింగిలోని విద్యుత్ డీఈ కార్యాలయంలోని రెవెన్యూ విభాగంలో దీపావళి పూజలు ఘనంగా నిర్వహించారు. శనివారం జరిగిన పూజా కార్యక్రమంలో సైబర్ సిటీ సర్కిల్ ఎస్ఈ చంద్రశేఖర్ పూజలలో పాల్గొన్నారు. డీఈ రమేష్ చంద్ర, ఏడీఈ రాంబాబు, సీఎస్‌సీ సైదులు, ఈఆర్‌ఓ అకౌంట్స్ అధికారి రాజు, 1104 ఉద్యోగ సంఘం నాయకుడు ఎం. భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

శబరిమలకు పాదయాత్ర



మణికొండ: అయ్యప్ప భక్తులు కాలినడకన శబరిమలలోని అయ్యప్ప స్వామిని దర్శించుకునేందుకు బయలు దేరి వెళ్లారు. మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో శవిప్రీతం రెడ్డి, మహేందర్‌రెడ్డిలు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించి ఇరుముడులు కట్టుకుని వెళ్లారు. వారి ప్రయాణం సజావుగా సాగి స్వామి వారి దర్శనం పూర్తి చేసుకుని తిరిగి రావాలని గురుస్వాములు రాజేందర్‌గౌడ్, బి.సాయిరెడ్డిలు ఆకాంక్షించారు.

కార్మికులకు అండగా ఉంటాం

మణికొండ: ప్రతి నిత్యం ప్రజలకు తమ సేవలు అందించే మున్సిపల్ కార్మికులకు అండగా ఉంటామని నార్సింగి మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మెన్ జి.వెంకటేశ్‌యాదవ్ అన్నారు. దీపావళి పండగను పురస్కరించుకుని శనివారం మున్సిపల్ కార్మికులకు ఆయన కొత్త బట్టలు, స్వీట్ బాక్స్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు ప్రజలకు అందిస్తున్న సేవలు అమోఘమని, వారికి అన్ని రకాలుగా తాము ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ అరుణజ్యోతి, మున్సిపల్ కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మణికొండ: మూసీనది పక్కనే ఓ కుంటలో కుళ్లి పోయిన దశలో ఉన్న ఓ వ్యక్తి మృతదేహం నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో కనిపించింది. పోలీసులు తెలిపిన మేరకు.. మంచిరేవుల కీర్తి విల్లాస్ వెనక ఉన్న కుంటలో ఓ వ్యక్తి మృతదేహం తేలియాడుతుందని స్థానికులు సమాచారం ఇచ్చారన్నారు. గుర్తు తెలియని వ్యక్తి వయసు సుమారు 30 నుంచి 35 సంవత్సరాల ఉంటుందని, అతని గురించి చుట్టు పక్కల వారిని అడిగినా ఎలాంటి సమాచారం తెలియలేదన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించామని, మృతుడి సమాచారం తెలిసిన వారు నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో తెలపాలని పోలీసులు కోరారు.

'బీసీ బంద్' ప్రశాంతం

శేరిలింగంపల్లి జోన్ బృందం: తెలంగాణ బీసీ జేఏసీ పిలుపుపై 'బీసీ బంద్' ప్రశాంతంగా సాగింది. శేరిలింగంపల్లి జంట సర్కిళ్ళ పరిధిలో వివిధ రాజకీయపార్టీలు, విద్యార్థి సంఘాలు, కుల సంఘాలు, ఇతర వర్గాలకు చెందిన బీసీ నాయకులు బంద్‌లో పాల్గొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో, మియాపూర్‌లోని డిపోల నుంచి బస్సులు ఉదయం నుంచి బయటకు రాలేదు. మధ్యాహ్నం తర్వాత దుకాణాలు తెరుచుకున్నాయి. ప్రైవేటు విద్యాసంస్థలన్నీ బంద్ నేపథ్యంలో సెలవు ప్రకటించగా, ప్రభుత్వ పాఠశాలలకు బీసీ నాయకులు వెళ్లి బంద్ చేయించారు. దుకాణాలు, వ్యాపార సముదాయాలు మధ్యాహ్నం వరకు మూసి ఉంచారు. సినిమా థియేటర్లు పనిచేశాయి.

- చందానగర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.
- కొండాపూర్, బొటానికల్ గార్డెన్, హెచ్‌సీయూ వరకు భారీ ర్యాలీని విద్యార్థిసంఘాలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



కొండాపూర్, బొటానికల్ గార్డెన్ ప్రాంతంలో..


చందానగర్‌లో..


మియాపూర్ డిపో ముందు..


హెచ్‌సీయూ ప్రధాన గేటు వద్ద..


గచ్చిబౌలిలోని ఆర్టీసీ హెచ్‌సీయూ డిపో వద్ద..


మియాపూర్ -2 డిపో ముందు..


మియాపూర్ ఆర్టీసీ డిపో ముందు..


హెచ్‌సీయూ డిపోలో డిపోకే పరిమితమైన బస్సులు


బొటానికల్ గార్డెన్ వద్ద..

సోషల్ మీడియాపై జాగ్రత్త అవసరం

సీఐ వినాయక్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: విద్యార్థులు సోషల్ మీడియా, సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని పటాన్‌చెరు సీఐ వినాయక్ రెడ్డి అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విశ్వ భారతి లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భవాని అధ్యక్షతన నిర్వహించిన లీగల్ అవేర్నెస్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఐ విచ్చేసి ప్రసంగించారు. విద్యార్థులు సోషల్ మీడియా ద్వారా వ్యక్తిగత వివరాలు, బ్యాంకింగ్ వివరాలు ఇతరులతో పంచుకోవద్దన్నారు. సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులతో స్నేహం చేయొద్దని సూచించారు. సైబర్ క్రైమ్ జరిగిన వెంటనే 1930కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే ప్రిన్సిపాల్ డాక్టర్ భవాని మాట్లాడుతూ.. రైట్ టు ఎడ్యుకేషన్, బాల్యవివాహాలు, పోక్సోపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రణాళికాబద్ధంగా చదువుకొని లక్ష్యాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో బాలికల ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ స్పందన చౌదరి,విశ్వ భారతి లా కళాశాల అధ్యాపకులు రమ్య, కీర్తి ,తేజశ్రీ, తేజ సప్తోజి, గురుమూర్తి, యాష్ వర్ధన్,కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

జిన్నారం(పటాన్‌చెరు): గడ్డపోతారం పట్టణ పరిధిలోని అలీనగర్ సర్వే నంబర్ 27లో ప్రభుత్వ భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను శనివారం రెవెన్యూ అధికారులు నేలమట్టం చేశారు. అక్రమ నిర్మాణాలపై వచ్చిన ఫిర్యాదులకు తహసీల్దార్ దేవదాస్ ఆదేశాల మేరకు ఆర్ఐ జయప్రకాశ్ నారాయణ మున్సిపల్ అధికారుల సహకారంతో కూల్చివేశారు. ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలకు పాల్పడితే సహించబోమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నాలెడ్జి సిటీలో అర్ధరాత్రి నాకాబందీ

- 23 వాహనాలు సీజ్
- 280 వాహనాల పెండింగ్ చలానాల రికవరీ



గచ్చిబౌలి: రాత్రి సమయంలో అసాంఘిక శక్తుల ఆటకట్టించే దుకు, రోడ్డు ప్రమాదాలను నివారించే క్రమంలో రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో నాకాబందీ నిర్వహించారు. మాదాపూర్ డీసీపీ రుతురాజ్ నేతృత్వంలో అర్ధరాత్రి 12 నుంచి శనివారం తెల్లవారుజామున 2.30 గంటల వరకు నాలెడ్జిలో నాకాబందీ నిర్వహించారు. కేబుల్ బ్రిడ్జీ, ఐకియా రోడ్డుతో పాటు అన్ని రోడ్లను అష్టదిగ్బంధనం చేశారు. దాదాపు 1056 వాహనాలను తనిఖీ చేశారు. 280 వాహనాల నుంచి రూ.2,81,502 మొత్తం పెండింగ్ చలానాలను కట్టించారు. డాక్యుమెంట్లు, నెంబర్ ప్లేట్లు లేని 23 వాహనాలను సీజ్ చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ముగ్గురిపై కేసు నమోదు చేశారు. మాదాపూర్ ఏసీపీ శ్రీధర్, రాయదుర్గం డీఐ భూపతి, ఎస్‌హెచ్‌ఓ వెంకన్న పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన





మాదాపూర్: కళాకారులు భరతనాట్య ప్రదర్శనతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహించే వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం వైష్ణవి నాట్య సెంటర్ గురువు వైష్ణవి సాయినాథ్ శిష్యబృందం భరతనాట్య ప్రదర్శనతో అలరించారు.

అన్నమయ్యపురంలో..



మాదాపూర్: కళాకారులు కూచిపూడి నృత్యప్రదర్శనతో సందర్శకులను ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం నృత్యజ్యోతి కూచిపూడి అకాడమీ సంస్థ గురువు అంగరమాధవి శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనతో అలరించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక



మణికొండ: రాష్ట్ర స్థాయిలో జరిగే రెజ్లింగ్ పోటీలలో సత్తా చాటి అత్యధిక పతకాలను సాధించి జిల్లాకు మంచి గుర్తింపు తేవాలని జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ చైర్మెన్ ఆంజనేయులు అన్నారు. శనివారం నార్సింగిలోని వీరాంజనేయ వ్యాయామశాలలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో ఉత్తమ రెజ్లర్‌లకు పోటీలు నిర్వహించి ఈనెల 21వ తేదీన జియాగూడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పాండు, కోశాధికారి, కోచ్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

జేఎన్‌వీ దరఖాస్తుకు గడువు తేదీ పెంపు

రాయదుర్గం: జవహర్ నవోదయ విద్యాలయలోని 9,11 తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకొనే గడువు తేదీని మరోసారి పెంచినట్లు శేరిలింగంపల్లి గోపన్‌పల్లిలోని జేఎన్‌విరంగారెడ్డి జిల్లా ప్రిన్సిపల్ విజయభాస్కర్ తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఈనెల 23వ తేదీ వరకు గడువును పొడిగించినట్లు వివరించారు. దరఖాస్తు చేసుకున్న వాటిలో మార్పులు చేసుకోవడానికి కూడా అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. అందుకోసం ఈనెల 24వ తేదీ నుంచి 26వ తేదీ వరకు 'కరెక్షన్ విండో' ద్వారా మార్పులను కేవలం ప్రాంతం/లింగం/ వర్గం/ వైకల్యం/పరీక్షా మాధ్యమం వంటి వాటినే మార్పులు చేసుకోవడానికి అవకాశం కల్పిస్తారని స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

రేషన్ బియ్యం పట్టివేత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): హైదరాబాద్ నగరంలోని రాజేందర్ నగర్ నుంచి కర్ణాటక రాష్ట్రానికి డీసీఎంలో తరలిస్తున్న 12 టన్నుల రేషన్ బియ్యాన్ని శనివారం తెల్లవారు జామున రింగ్ రోడ్డుపై కొల్లూరు పోలీసులు పట్టుకొని వాహనాన్ని సీజ్ చేశారు. మహమ్మద్ షమీ డీసీఎంలో 12 టన్నుల రేషన్ బియ్యాన్ని కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్తీబాటలో పాల్గొన్న విద్యుత్ అధికారులు


తారానగర్‌లో సంక్షేమసంఘం ప్రతినిధులతో మాట్లాడుతున్న దృశ్యం

శేరిలింగంపల్లి: తారానగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని శివాజీనగర్‌లో విద్యుత్ అధికారులు ప్రజాబాటలో శనివారం పాల్గొన్నారు. సీఈ పాండ్య ఆధ్వర్యంలో విద్యుత్ అధికారులు శివాజీనగర్‌లో ప్రజాబాటలో పాల్గొని విద్యుత్ వినియోగదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు వారితో సమావేశమై కాలనీలో పర్యటించారు. కాలనీలో కొత్త ఏబీ కేబుల్ స్ట్రింగ్ పనులు ప్రాధాన్యతా ప్రాతిపదికన జరగాల్సి ఉందని, దెబ్బతిన్న రెండు విద్యుత్ స్తంభాలను మార్చడం, డీటీఆర్ సరిదిద్దడం వల్ల అంతరాయాలను తగ్గించే సామర్థ్యం మెరుగు పడుతుందని అధికారులు వారికి వివరించారు. కార్యక్రమంలో గచ్చిబౌలి ఏడీఈ శివకృష్ణప్రసాద్, తారానగర్ ఏఈ వెంకట్‌నారాయణ, ఓ అండ్ ఎం సిబ్బంది తనిఖీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బాణాసంచా దుకాణదారులు అనుమతులు తీసుకోవాలి

మియాపూర్: దీపావళి సందర్భంగా ఏర్పాటుచేసే బాణాసంచా దుకాణదారులు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని మియాపూర్ ఇన్‌స్పెక్టర్ శివ ప్రసాద్ తెలిపారు. బాణాసంచ దుకాణాదారుల యజమానులతో సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిండంతో పాటు జాగ్రత్తలు సూచిస్తున్నారు. తప్పని సరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కల్గకుండా దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని, అనుమతులు లేకపోతే చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. దుకాణాలు ఖాళీ స్థలాల్లోనే ఏర్పాటు చేసుకోవాలన్నారు. జీహెచ్‌ఎంసీతో పాటు వివిధ పోలీసులు, అగ్నిమాపక అనుమతులు తీసుకోవాలి. ట్రేడ్ లైసెన్స్‌లు లేకుండా టపాసులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మియాపూర్ సీఐ శివ ప్రసాద్ తెలిపారు.



జాతీయ క్రీడలకు వేదికగా పటాన్‌చెరు

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి
- ముగిసిన 69 వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి క్రీడలు

పటాన్‌చెరు: క్రీడలకు, క్రీడాకారులకు కేంద్రంగా పటాన్‌చెరు నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతున్నామని..రాబోయే రోజుల్లో రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు ఆతిథ్యం ఇవ్వబోతున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. మూడు రోజులుగా పటాన్‌చెరులోని మైత్రి మైదానం వేదికగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సౌజన్యంతో నిర్వహిస్తున్న 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్ 14 బాలుర, బాలికల కబడ్డీ ,అండర్ 17 బాలుర వాలీబాల్ విభాగం రాష్ట్రస్థాయి పోటీలు శనివారం ముగిశాయి. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వాలీబాల్ జాతీయ స్థాయి క్రీడాకారుడు కృష్ణం రాజుతోపాటు రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమష్టికృషితో రాష్ట్రస్థాయి క్రీడలను విజయవంతం చేశామన్నారు. జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు ఆర్థిక సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని వీరేశ్ మాట్లాడుతూ...క్రీడల పట్ల ఆసక్తి కలిగిన ఎమ్మెల్యే లభించడం పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజల అదృష్టం అన్నారు. రాబోయే రోజుల్లో జాతీయస్థాయి కబడ్డీ జట్టులో తెలంగాణ క్రీడాకారుల ప్రాతినిధ్యం పెరగాలని ఆకాంక్షించారు. కబడ్డీ అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి జగదీశ్ యాదవ్ మాట్లాడుతూ..కబడ్డీ క్రీడలో జాతీయస్థాయిలో మెదక్ జిల్లా క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించడం ప్రశంసనీయమన్నారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గం నుండి కబడ్డీ క్రీడాకారులు సైతం జాతీయ స్థాయి జట్టుకు ఎంపిక కావాలని అభిలాషించారు.


గెలుపొందిన క్రీడాకారులతో ఎమ్మెల్యే

మెదక్ జట్టు ఘన విజయం

శనివారం సాయంత్రం అభిమానుల మధ్య జరిగిన అండర్ 14 బాలుర కబడ్డీ ఫైనల్ మ్యాచ్‌లో నల్లగొండ జిల్లా జట్టుపై మెదక్ జట్టు ఘన విజయం సాధించింది..అండర్ 14 బాలికల కబడ్డీ ఫైనల్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ జిల్లా జట్టు పైన ఖమ్మం జిల్లా జట్టు పైన ఘన విజయం సాధించింది. అండర్ 17 బాలుర వాలీబాల్ ఫైనల్ మ్యాచ్ లో వరంగల్ జిల్లా జట్టుపై ఖమ్మం జిల్లా జట్టు ఘన విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, పటాన్‌చెరు డీఎస్పీ ప్రభాకర్, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, మాజీ కార్పొరేటర్ సపనా దేవ్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, గూడెం మధుసూదన్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మైత్రి క్లబ్ అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి, ఎంఈవో లు పీపీరాథోడ్, నాగేశ్వర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225462